01 page 24_01 page 24.qxd 24-05-2026 AM 01:31 Page 1

కర్నూలు | నంద్యాల వార్త
24 మే 2026 ఆదివారం పేజీలు 4

పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలులో.. కఠిన చర్యలు

: లింగ నిర్ధారణ పరీక్షలపై నిరంతర నిఘా
: 17 కొత్త స్కానింగ్ కేంద్రాలకు అనుమతి
: 20 కేంద్రాల రెన్యువల్‌కు ఆమోదం
: 7 స్కానింగ్ కేంద్రాల రద్దుకు నిర్ణయం

కర్నూలు, మే 23 ప్రభాతవార్త:
జిల్లాలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పీసీ అండ్ పీఎన్‌డీటీకి సంబంధించిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి సలహా కమిటీ 17 కొత్త స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లకు, 20 స్కానింగ్ కేంద్రాల రెన్యువల్‌కు ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ వెల్లడించారు. అలాగే 7 స్కానింగ్ కేంద్రాల రద్దుకు, 6 దరఖాస్తులను తిరస్కరించేందుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో 7వ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, డీఎంహెచ్‌వో డాక్టర్ కామేశ్వర ప్రసాద్, ఎన్‌జీఓ ప్రతినిధి డాక్టర్ బాలమద్దయ్య, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత, డెమో ప్రకాష్, డిప్యూటీ డెమో షఫీ ఉన్నిష తదితరులు పాల్గొన్నారు.

రూ.14.67 కోట్లతో 150 పడకల విశ్రాంతి సదన్ నిర్మాణానికి భూమిపూజ..!

: కర్నూలు సర్వజన ఆసుపత్రిని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యం : మంత్రి టీజీ భరత్

కర్నూలు, హాస్పిటల్ మే 23 ప్రభాతవార్త :
కర్నూలు సర్వజన ఆసుపత్రి అభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఆహార ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కర్నూలు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో రూ.14.67 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 150 పడకల విశ్రాంతి సదన్ భవనానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ భవనాన్ని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా నిర్మించనుంది. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ రామ మోహన్ బుర్రా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారని, వారి బంధువులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు ఈ విశ్రాంతి సదన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించి ప్రస్తుతం రాష్ట్రంలో మూడవ స్థానంలో ఉన్న ఆసుపత్రిని మొదటి స్థానానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో క్యాన్సర్ ఆసుపత్రి సేవలు మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రస్తుతం అవసరానికి మించి రోగులు చికిత్స పొందుతున్నారని, అందువల్ల ఆసుపత్రికి మరిన్ని సదుపాయాలు అవసరమని పేర్కొన్నారు. నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు పూర్తయ్యాయని, భవనాన్ని పది నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సంస్థలకు సూచించారు. ఈ సందర్భంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్ వంశీ రామ మోహన్ బుర్రా మాట్లాడుతూ, తమ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.100 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిందని తెలిపారు. గతంలో కర్నూలు ఆసుపత్రికి సిటీ స్కాన్ పరికరాల కోసం నిధులు అందించామని, ఇప్పుడు విశ్రాంతి సదన్ నిర్మాణం ద్వారా మరో ముఖ్యమైన సేవ అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఆసుపత్రి అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే..

• వివరాలు 2లో

బీసీ రిజర్వేషన్లపై.. సమగ్ర పరిశీలన

: బీసీ రిజర్వేషన్ల నిర్ణయానికి డెడికేటెడ్ కమిషన్ చర్యలు
: జనాభా గణాంకాలు, సామాజిక వెనుకబాటు, ప్రాతినిధ్యంపై అధ్యయనం
: స్థానిక సంస్థల ఎన్నికలు సమయానికి నిర్వహించడం కీలకమన్న కమిషన్ చైర్మన్

కర్నూలు, మే 23, ప్రభాతవార్త :
రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం స్థానిక సంస్థల వారీగా బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు అవసరమైన సమగ్ర అంచనా ప్రక్రియ కొనసాగుతోందని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, విశ్రాంత ఐఏఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై కుల సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజల నుండి కమిషన్ వినతులను స్వీకరించింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు కేటాయించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న జనాభా గణాంకాలు, గత ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యం, ప్రస్తుత సామాజిక పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు నిర్ణయించే ప్రక్రియలో ఖచ్చితమైన జనాభా అంచనా అత్యంత కీలకమని పేర్కొన్నారు. బీసీల సామాజిక వెనుకబాటు, వారి జనాభా శాతం అనే రెండు ప్రధాన అంశాలను కమిషన్ పరిశీలిస్తోందన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, ఎంఎ టీసీలు, జెడ్పీటీసీలు వంటి ప్రతి ఎన్నికల యూనిట్‌లో ఎంత శాతం స్థానాలు బీసీలకు కేటాయించాలనే అంశంపై కమిషన్ సిఫారసులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో డేటా నాణ్యత, ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని చైర్మన్ స్పష్టం చేశారు. 99 శాతం సర్వే పూర్తయిందనేది మాత్రమే కాకుండా, 99 శాతం ఖచ్చితత్వం కూడా ఉండాలని అధికారులకు సూచించారు. అప్పుడు మాత్రమే ఆ డేటాను కమిషన్ విశ్వసనీయంగా ఉపయోగించుకోగలదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమయానికి..

• వివరాలు 2లో

కలెక్టరేట్ పరిశుభ్రంగా ఉండాలి

: కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్
: ప్రతి శాఖ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశాలు

కర్నూలు, మే 23, ప్రభాతవార్త :
కలెక్టరేట్ ప్రాంగణం పరిశుభ్రంగా, సుందరంగా, ప్రజలకు అనుకూలంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కాంప్లెక్స్ ఆవరణంలో పరిశుభ్రత, పార్కింగ్ నిర్వహణ, గ్రీనరీ అభివృద్ధి, సుందరీకరణ, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు, భవనాల నిర్వహణ తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రభుత్వ పరిపాలనకు ప్రతిబింబంగా ఉండే ప్రధాన కేంద్రం కాబట్టి కార్యాలయ ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో సుందరీకరణ చర్యలు చేపట్టి, అన్ని విభాగాల్లో ఒకే విధానంలో గ్రీనరీ పెంపొందించాలని సూచించారు. మొక్కల పెంపకం, పచ్చదనం సంరక్షణ, పూల మొక్కల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి విభాగం పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం పరిశుభ్రత చర్యలు కొనసాగించాలని సూచించారు. కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించి అధికారులు, సిబ్బంది, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. అనధికార పార్కింగ్‌ను నియంత్రిస్తూ రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల్లో బెంచీల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు వేచి ఉండే సమయంలో ఇబ్బందులు పడకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రజలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రతి శాఖ బాధ్యతగా భావించాలని తెలిపారు. భవనాల వద్ద ఉన్న చిన్నచిన్న మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, పాడైన ప్రాంతాలను సరిచేసి కార్యాలయ వాతావరణాన్ని మెరుగుపరచాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి శాఖ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనాన్ని మరింత పెంపొందించి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. ఉద్యోగులు పనిచేయడానికి అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై మంచి అభిప్రాయం కలిగేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఆర్ అండ్ బి సూపరింటెండింగ్ ఇంజనీర్ మహేశ్వర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదోని ఆసుపత్రి.. అగ్రస్థానం

: రాష్ట్రంలోనే అత్యధిక ప్రసవాలతో ఆదోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి
: కంటి శుక్లాల ఆపరేషన్లలో ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి రికార్డు
: వైద్య సిబ్బందికి రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ ప్రశంసా పత్రాలు
అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు, మే 23, ప్రభాతవార్త :
2026 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రాష్ట్రంలోనే అత్యధిక ప్రసవాలు నిర్వహించి, అత్యధిక నవజాత శిశువులకు చికిత్స అందించిన ఆసుపత్రిగా ఆదోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది, ఎస్ఎన్‌సీయూ సిబ్బందికి రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు ప్రత్యేక ప్రశంసా పత్రాలు పంపించారు. అలాగే 2025 సంవత్సరంలో అత్యధికంగా 411 కంటి శుక్లాల ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించి రికార్డు సృష్టించిన ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రికి చెందిన కంటి వైద్య నిపుణుడు డాక్టర్ చిరంజీవికి రాష్ట్ర స్థాయి ప్రశంసా పత్రం అందజేశారు. కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 4 కిలోల బరువున్న శిశువుకు ఎటువంటి శస్త్రచికిత్స అవసరం లేకుండా అత్యంత నైపుణ్యంతో సాధారణ కాన్పు నిర్వహించిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు మరియు వైద్య సిబ్బందికి కూడా ప్రత్యేక ప్రశంసా పత్రాలు పంపించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచిన ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు ఆసుపత్రుల వైద్యులు, నర్సింగ్ మరియు పారామెడికల్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

ల్యాబ్‌టెక్నీషియన్ లేక.. ఇబ్బందులు

- దేవనకొండ పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీ...
- ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లిన ప్రజల జేబులకు చిల్లు...

దేవనకొండ, మే 23, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన దేవనకొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీ ఏర్పడి నెలలు గడుస్తున్నా భర్తీ చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారికి మందులు ఇచ్చే ఫార్మాసిస్టు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే వివిధ రక్త పరీక్షలు, తదితర పరీక్షలకై ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు జిల్లాలోనే అతిపెద్ద మండలం దేవనకొండ మండలం. మండలంలోని 44 గ్రామాలకు ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. పేద, సామాన్య ప్రజలు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి ఖర్చు పెట్టుకోలేని స్థితిలో ఉంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టులను నియమించి ప్రజలకు వైద్యసేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టండి : కలెక్టర్ డా.సిరి

: తుంగభద్రా నుంచి అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

కర్నూలు, మే 23, ప్రభాతవార్త :
తుంగభద్ర నది నుంచి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా అరికట్టే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. తుంగభద్ర నదిలో ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నదిలో స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల తెలంగాణ వైపు నుంచి కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వచ్చి అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కొంతలపాడు, దూద్యాల, ఎదురూరు, సుంకేసుల గ్రామాల పరిధిలో ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని సంయుక్త సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. తుంగభద్ర నదిలో ఇరు రాష్ట్రాల పరిధులను స్పష్టంగా గుర్తించేలా హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొంతలపాడు, దూద్యాల, ఎదురూరు, సుంకేసుల గ్రామాల పరిధిలోని నదీ ప్రాంతాల్లో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. అక్రమ ఇసుక రవాణా లేదా తవ్వకాలలో పాల్గొనే వాహనాలు పట్టుబడితే కోర్టు ఆదేశాలు లేకుండా విడుదల చేయవద్దని పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని, నదిలో అనుమానాస్పద కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డిపిఓ భాస్కర్, గనుల శాఖ అధికారి శివ పార్వతి, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతే ముఖ్యం - ఈవో

మహానంది, మే 23, ప్రభాతవార్తః
భక్తుల భద్రతే ముఖ్యమని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మహానంది పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకొని ఏఈవో మధుతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షించారు. కోనేటిలో స్నానం అచరించే భక్తులకు పలు సూచనలు చేశారు. పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉచిత ప్రసాదం ప్రతిఒక్క భక్తుడికి అందించాలని తెలిపారు. కామేశ్వరీ సహిత మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత క్యూలైన్లను పరిశీలించారు. క్యూలైన్ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఉచిత దర్శనంపై భక్తులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తు ఉండాలని సిబ్బందికి సూచించారు. వీరి వెంట సూపరింటెండెంట్ నీలకంటేశ్వర్‌రాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా లాడ్జిలు నిర్మిస్తే చర్యలు తప్పవు

- అర్బన్ డెవలప్‌మెంట్ కోసం సహకరించాం కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

మంత్రాలయం, మే 23, ప్రభాతవార్త; కుడా అప్రూవల్ లేకుండా లాడ్జిలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మంత్రాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మొదట్లో మంత్రాలయంలో లాడ్జిలు అనుమతులు లేకుండా నిర్మించారన్నారు. ప్రస్తుతం ఇప్పుడు చాలావరకు అనుమతులు తీసుకున్నారు. మంత్రాలయంలో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కుడా చైర్మన్ అయిన తర్వాత టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో అర్బన్ డెవలప్‌మెంట్ కోసం నిధులు రెండు జిల్లాల్లో మంజూరు చేయడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కుడాలో సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు.

మే 26న శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వ వార్షిక దేవర మహోత్సవం

– ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజుస్వామి – శ్రీ ముత్యాలమ్మకు ఘనంగా వారపు పూజలు

మద్దికెర, మే 23, ప్రభాతవార్త; గుంతకల్ జి.కొట్టాల గ్రామంలో వెలిసిన భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వ దేవర మహోత్సవాన్ని మే నెల 26వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజుస్వామి శుక్రవారం తెలిపారు. ప్రతియేటా ఘనంగా దేవర మహోత్సవాన్ని చేపడతామన్నారు. కోరికలు నెరవేరిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఊరేగింపులో పాల్గొంటారన్నారు. వచ్చిన భక్తులకు మే 26న ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేవర మహోత్సవంలో పాల్గొనే భక్తులకు వసతి, తాగునీరు, అన్నదానం తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

– శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వకు ప్రత్యేక పూజలు

శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వకు మంగళవారం వారపు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు నెరవేరిన వారు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు, పూజారి ముత్యాల గంగరాజుస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, పూజారి ముత్యాల గంగరాజుస్వామి మాట్లాడుతూ ఆది, మంగళ, శుక్రవారాల్లో ముత్యాలమ్మవ్వ వారికి భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కోరికలు నెరవేరిన భక్తులు ఆలయం వద్ద అమ్మవారికి బోనాలతో ప్రసాదం సమర్పిస్తారని, ఒడిబియ్యంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. భక్తుల ఆరాధ్య దైవంగా, పిలిస్తే పలికే తల్లిగా శ్రీ ముత్యాలమ్మవ్వ వెలుగొందుతున్నారని తెలిపారు.

రూ.14.67 కోట్లతో 150 పడకల విశ్రాంతి సదన్

(మొదటి పేజీ తరువాయి) : నిర్మాణానికి భూమిపూజ..!గౌరు చరిత మాట్లాడుతూ, ఈ భవనం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక ప్రజలకు కూడా ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి భవనం పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని అధికారులను కోరారు. సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 1956లో ప్రారంభమైన ఈ ఆసుపత్రి ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. ప్రతి రోజు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా రోగులు వస్తున్నారని, వారికి వసతి సౌకర్యాల కొరత ఉండటంతో ఈ విశ్రాంతి సదన్ నిర్మాణం ఎంతో అవసరమైందన్నారు. మంత్రి టీజీ భరత్ కృషి వల్ల ఆసుపత్రి రాష్ట్రంలో మూడవ స్థానానికి చేరుకుందని, త్వరలోనే మొదటి స్థానానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం స్నేహ శ్రీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.6.35 లక్షల విలువైన బ్యాటరీతో నడిచే ప్రత్యేక వాహనాన్ని క్యాన్సర్ ఆసుపత్రి రోగుల సేవల కోసం ప్రారంభించి ఆసుపత్రి అధికారులకు అందజేశారు.

బీసీ రిజర్వేషన్లపై.. సమగ్ర పరిశీలన

(మొదటి పేజీ తరువాయి) : నిర్వహించడం రాష్ట్రానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం గ్రాంట్ల విడుదలకు ఎన్నికలు తప్పనిసరి అని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బీసీ జనాభా, రిజర్వేషన్ శాతాలపై కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాతే ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతుందని చెప్పారు. జనాభా వివరాలు, ఓటర్ల సంఖ్య, బీసీ ఓటర్ల నిష్పత్తి వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తూ సంబంధిత డేటాను క్రాస్ చెక్ చేస్తున్నామని తెలిపారు. కుల సంఘాల ప్రతినిధులు వ్యక్తం చేస్తున్న సమస్యలను నమోదు చేసి పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, డిమాండ్లను స్వయంగా విన్నప్పుడే వాస్తవ పరిస్థితులు పూర్తిగా అర్థమవుతాయని అన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై గుణాత్మక నివేదిక కూడా అవసరమని చైర్మన్ అభిప్రాయపడ్డారు. విద్యాపరమైన సమస్యలు, విద్యార్థుల బడి మానివేత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మాట్లాడుతూ, రాజీవ్ రంజన్ మిశ్రా ఆంధ్రప్రదేశ్-తెలంగాణ క్యాడర్‌లో వివిధ కీలక శాఖల్లో విశిష్ట సేవలు అందించారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై సమగ్ర అధ్యయనం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పరిపాలనా నిర్మాణం, జనాభా గణాంకాలు, బీసీ వర్గాల ప్రాతినిధ్యంపై కమిటీకి సమగ్ర వివరాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లు, 27 మండలాలు, 484 గ్రామపంచాయతీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్, రెండు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ ఉన్నాయని వివరించారు. జిల్లాలో అక్షరాస్యత శాతం 59.89 కాగా, బీసీల అక్షరాస్యత 64.98 శాతంగా నమోదైందన్నారు. అర్బన్ జనాభా 32 శాతం, గ్రామీణ జనాభా 67 శాతం, జనసాంద్రత ప్రతి చదరపు కిలోమీటరుకు 296 మంది, లింగ నిష్పత్తి 990గా ఉందని తెలిపారు. జిల్లాలో బీసీ వర్గాల జనాభా సుమారు 50 నుంచి 60 శాతం వరకు ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, ఒక మేయర్, నలుగురు చైర్‌పర్సన్లు, 13 జెడ్పీటీసీలు, 256 ఎంపీటీసీలు, 14 ఎంపీపీలు, 78 వార్డు సభ్యులు లేదా కౌన్సిలర్లు, 286 మంది సర్పంచులు కలిపి మొత్తం 657 మంది బీసీ ప్రజాప్రతినిధులు ఉన్నారని తెలిపారు. అనంతరం కుల సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజల నుండి డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వినతులను స్వీకరించారు. సమావేశంలో డెడికేటెడ్ కమిషన్ సెక్రటరీ రాజు, డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ రమణరెడ్డి, సీపీఓ భారతి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, డీపీఓ భాస్కర్, సర్వ శిక్ష అభియాన్ పీవో లోకరాజ్, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, ఉప్పర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబిత ఖచ్చితత్వానికి ఎస్ఐఆర్ కీలకం

–కర్నూలు ఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు

–ఎస్ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీలతో సమావేశం

కర్నూలు మున్సిపల్, మే 23, ప్రభాతవార్త: ఓటర్ల జాబిత ఖచ్చితత్వం, పారదర్శకత కోసం భారత ఎన్నికల సంఘం చెప్పబడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. శనివారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 జనవరి 1 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకొని ప్రస్తుత ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో 22-05-2026 నాటికి మొత్తం 2,74,607 మంది ఓటర్లు ఉన్నారని వీరిలో 1,59,375 మంది ఓటర్లకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి అయిందని ఇది 58.04 శాతమని పేర్కొన్నారు. ఇంకా 1,15,232 మంది ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. జూన్ 15 2026 నుంచి ఇంటింటికి సర్వే ప్రారంభం అవుతుందని బూత్ లెవెల్ అధికారులు ప్రతిఓటరుకు 2 ఎను ్యమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. 2002 ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారు తమ వివరాలను నమోదుచేయాలని పేరు లేని పక్షంలో కుటుంబ సభ్యుల వివరాలు పొందుపరచాలని సూచించారు. రెను ్యమరేషన్ ఫారంతో పాటు ఓటర్ పుట్టిన తేది, అధార్ నం. మొబైల్ నం. ఈపిక్ నం. ఉన్నట్లయితే కొత్త కలర్ ఫోటో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. బూత్ లెవెల్ అధికారి సంతకం చేసిన ఒక ఫారాన్ని రసీదుగా ఓటరుకు అందజేస్తారని తెలిపారు. డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీల గుర్తింపు తొలగింపు అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలు, తొలగింపుల కోసం ఫారం-6, ఫారం-7, ఫారం-8లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. జూలై 21 2026న మూసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయబడుతుందని అనంతరం జూలై 21 నుంచి ఆగష్టు 20 వరకు క్లైమ్స్ అభ్యంతరాలు స్వీకరించబడతాయని తెలిపారు. ఉద్యోగం, ఉపాధి, విద్య కారణంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు తమ కుటుంబ సభ్యుల ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. ఈసమావేశంలో ఆర్డీవి కృష్ణ, అదనపు కమిషనర్, తహశీల్దార్ డి రవికుమార్, ఎస్ఈ రమణమూర్తి, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ సుబ్బన్న, డిప్యూటి తహశీల్దార్ ధనుంజయ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

– ప్రతిపిటిషన్‌పై వేగవంతమైన చర్యలు – బాధ్యతారాహిత్యానికి కఠిన చర్యలు తప్పవు

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

ఆళ్లగడ్డ, మే 23, ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను అదేశించారు. శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్య క్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వన్ మంత్ ఫోర్ విజిట్ కార్య క్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజల నుండి స్వీకరించిన వినతులు ఫిర్యాదులపై అధికారులు వేగవంతంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని అదేశించారు. రెండవ వారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. గతవారం స్వీకరించిన 586 పిటిషన్లను అదేరోజు స్కాన్‌చేసి అధికారులకు పంపి వాటిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించామని తెలిపారు. దాదాపు అన్ని పిటిషన్లపై ఫీల్డ్‌స్థాయిలో పరిశీలను పూర్తి అయిందని పెండింగ్‌లో వాటిని వారంలోగా పూర్తిచేయాలని అదేశించారు. ఈవారం కూడ 500కు పైగా వినతులు స్వీకరించామని వాటిలో ఇళ్ళస్థలాలె పెన్షన్లు, రహదారులు, కల్వర్టులు, బ్రిడ్జిలు, హౌసింగ్ బిల్లులు, సదరం సర్టిఫికెట్లు రెవిన్యూ సంబంధిత సమస్యలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. హౌసింగ్ ఫర్ అల్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ళస్థలాలు కేటాయిస్తామన్నారు. ఇటీవల విడుదలైన మెమో ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 1 సెంటు స్థలాన్ని లేఅవుట్‌లలో స్వీకరించేందుకు అర్హులకు ప్రాధాన్యత ఇస్తు త్వరితగతిన పట్టాలు అందజేయాలని తహశీల్దార్‌లకు సూచించారు. కొత్తగా వచ్చే ప్రతి ధరఖాస్తును సచివాలయాల ద్వారా స్వీకరించి అర్హత నిర్ధారించిన తరువాత మాత్రమే పరిష్కార ప్రక్రియ పూర్తిచేయాలని సచివాలయంఓ ధరఖాస్తు పెట్టుకొండి అంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. సైట్ ఓపెన్ కాలేదు, తర్వాత పెడతాం వంటి కారణాలతో ధరకాస్తులను పెండింగ్‌లో పెడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తప్పుగా మార్కు అయిన పిటిషన్లను సంబంధిత అధికారులకు పార్వాడ్ చేసే అవకాశం ఉన్నప్పటికి నిర్లక్ష్యంగా రిజెక్టు చేసే చర్యలు సహించబోమన్నారు. గతంలో కొన్ని బాధ్యతా రాహిత్యపు సమాధానాలు తమదృష్టికి వచ్చాయని ప్రతి ధరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. ఫైనాన్సియల్‌కు సంబంధించిన అంశాలను సంబంధిత జిల్లా అధికారుల ద్వారా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని అవసరమైన నిధులను ఎన్ఆర్ఈజీఎస్, డిఎంఎఫ్ లేదా శాఖల నిధుల ద్వారా సమకూర్చే అంశాన్ని స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. అందుబాటులో లేని పక్షంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అవకాశం కూడ నివేదికల్లో స్పష్టం చేయాలని అదేశించారు. కేవలం అంచనాలు సిద్ధం చేసి ఫైల్స్ పంపడం వల్ల ప్రయోజనం లేదని సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను సమగ్రంగా తెలియజేయాలని వాటర్ రిసోర్స్ అధికారులకు తెలిపారు. ప్రజల సమస్యలు పట్ల బాధ్యతతో చిత్తశుద్ధితో వ్యవహరించాలని అసంబధమైన సమాధానాలు అంగీకరించబోమని స్పష్టం చేశారు. కోర్టు వ్యవహారాలు, చట్టపరమైన అంశాలకు సంబంధించిన కేసుల్లో ప్రజలకు సమయానుకూల సమాచారం అందించి నమ్మకం కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ గత వారం నిర్వహించిన స్పందన కార్యక్రమం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం కలిగిందన్నారు. కార్యక్రమాన్ని నాలుగు వారాలకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కేవలం ఫైల్స్ ఒకశాఖ నుండి మరోశాఖకు పంపించడం కాకుండా పనులు పూర్తి అయ్యేలా అధికారులు బాధ్యత వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో వివిధశాఖల పనితీరుపై సమీక్షలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో హౌసింగ్ బిల్లులకు సంబంధించి రూ.49 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారని ఇలాంటి ఆర్థిక సమస్యలు తమ దృష్టికి తేస్తే ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో చర్చించి నిధుల విడుదలకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో సహ అన్నిశాఖల అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

: మామిడూరు బ్రదర్స్ దాతృత్వానికి ఆలయ కమిటీ అభినందనలు

బనగానపల్లె, మే 23 ప్రభాతవార్త: బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి అనంతపురం జిల్లా యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన కాశీ ఉపేంద్ర గారి కుమారులు మామిడూరు బ్రదర్స్ ఆలయ అభివృద్ధి కోసం రూ.50,000 విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

– భారీగా పాల్గొన్న బ్రాహ్మణులు – 24న ప్రమాణస్వీకారం

నందికొట్కూరు,మే 23,ప్రభాతవార్త: ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నియోజకవర్గంలోని మిడుతూరు మండలం రోడ్డపాడు శ్రీబరకసంజీవరాయుడు కళ్యాణ మండపంలో చెరుకుచెర్ల రఘురామయ్య అధ్యక్షతన నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సమావేశానికి కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు వివిధ రాష్ట్రాల నుండి 90 మంది ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా పంజాబ్‌కు చెందిన పండిట్ శేఖర్‌శుక్లా వ్యవహరించారు. ఉదయం 11 గంటలకు ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షులుగా డా.ప్రదీప్‌జ్యోతి (త్రివేండ్రం కేరళ), జనరల్ సెక్రటరీగా యశుపాల్ తివారి (చండీఘర్ పంజాబ్),కోశాధికారిగా కొండపల్లి కేశవరావు (మహబూబాబాద్ తెలంగాణ), మహిళా వింగ్ ప్రసిడెంట్‌గా శ్రీమతి మాలిని (బెంగుళూరు కర్ణాటక), యూత్ వింగ్ అధ్యక్షులుగా కరణం నవీన్ కుమార్(కర్నూలు, ఆంధ్రప్రదేశ్) నామినేషన్లు వేయగా 12.30 గంటలకు అంతా ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లుగా ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. ఈ సంధర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతు 1984లో విశాఖపట్నంలో ఫెడరేషన్ ఏర్పాటు అయినప్పటి నుంచి బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామని, ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, ప్రభుత్వ ఆదీనంలో ఉన్న దేవాలయాలు హిందువుల నిర్వహణలోకి తీసుకు వచ్చేందుకు కృషిచేయాలి, కులప్రాతిపదికన ఉన్న రిజర్వేషన్లను తొలగించి ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి ఆదుకోవాలని తదితర అంశాలపై కృషిచేస్తామని తెలిపారు.రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెరుకుచెర్ల రఘురామయ్య కోరిక మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇక్కడ ఏర్పాటు చేశామని, భవిషత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఆయన చేరుకోవాలని ఆయన తెలిపారు. ఈ నెల 24న రోళ్ళపాడులోనే ప్రమాణస్వీకారం నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుండి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్ల రామాపురంలో "శక్తి యాప్" పై అవగాహన

ఆత్మకూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త: నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరన్ ఐపీఎస్ ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి రామాంజి నాయక్ ఆదేశాలతో శనివారం మండల పరిధిలోని వడ్ల రామాపురం గ్రామ పంచాయతీ సెక్రెటరీ బి. లక్ష్మీదేవి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున వడ్ల రామాపురం నుండి కొట్టాల చెరువు గ్రామం కు పోవు లో ఎన్ఆర్ఇజిఎస్ ఉపాధి హామీ పథకం లో భాగంగా జరుగుచున్న కరువు పనికి వచ్చిన మహిళలకు అక్కడికి వచ్చిన ఉపాధి కూలీలకు " శక్తీ యాప్ " పై అవగాహన కార్యక్రమం లో భాగంగా మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకే ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ వాట్స్ అప్ లో పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జేరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం అయినది. అందరు యొక్క ఆండ్రాయిడ్ మొబైల్స్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని, ఆపద సమయం లో ఎలా ఉపయోగించుకోవాలో తెలుపుతూ కలిపిస్తూ ప్రోగ్రాము చేయడం జరిగినది. స్కూళ్లకు కాలేజీలకు పిల్లలకు సెలవులు ఉన్న కారణంగా పిల్లలు బావులలో చెరువులలో ఈత కొట్టడానికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించడం అయినది. అదేవిధంగా మీ, మీ ఇంట్లోని మగవారు వారి మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేసే లాగా చెప్పమని చెప్పు ఏదైనా అనుకోకుండా యాక్సిడెంట్లు జరిగితే తలకు దెబ్బలు తగలడం వల్లనే నూటికి 90 శాతం మంది చనిపోవడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు కచ్చితంగా తలకు హెల్మెట్ ధరించమని శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నూర్ అహ్మద్ డబ్ల్యూ హెచ్ జి.సుప్రియ తెలిపారు. అక్కడికి వచ్చిన మగవారికి ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడపవద్దని తెలుపుతూ అట్లా తాగి వాహనాలు నడిపితే 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను కోర్టు వారు విధిస్తారని తెలుపుతూ నిర్వహించారు.

మద్యం సేవించి ట్రాక్టర్ నడిపిన వ్యక్తికి 20 రోజుల జైలు శిక్ష



బనగానపల్లె, మే 23 ప్రభాతవార్త: నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణతో పాటు విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతంగా నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నందివర్గం సబ్ఇన్‌స్పెక్టర్ భూపాలుడు ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. మండలంలోని పలుకూరు గ్రామం చల్ల మద్దిలేటి కార్యాలయం సమీపంలో చేపట్టిన ఈ తనిఖీల్లో పలుకూరు గ్రామానికి చెందిన తలారి రమేష్ అలియాస్ బోయ రమేష్ (39), తండ్రి వెంకటేశ్వర్లు, మద్యం సేవించి ప్రమాదకరంగా ట్రాక్టర్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతనికి బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి బనగానపల్లె కోర్టు (ఇన్‌చార్జ్ ఆళ్లగడ్డ కోర్టు)లో హాజరుపరిచారు. కేసును విచారించిన గౌరవ న్యాయస్థానం ముద్దాయికి 20 రోజుల జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా ఎస్ఐ భూపాలుడు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం..!

బనగానపల్లె, మే 23 ప్రభాతవార్త: ప్రాచీన కళారూపాలను పరిరక్షిస్తూ గ్రామీణ జానపద కళాకారులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సాంస్కృతిక పరిరక్షణతో పాటు ప్రజా చైతన్యానికి ఆట, మాట, పాటల ద్వారా నిరంతరం కృషి చేస్తోందన్నారు. సాంఘిక నాటకాలకు పెద్దపీట వేస్తూ నాటి నుంచి నేటి వరకు వివిధ కళారూపాలకు ప్రాధాన్యతనిస్తూ కళాకారుల సమస్యల పరిష్కారానికి, ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసిందని తెలిపారు. అలాగే నాటక రంగ కళాకారులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కళారంగాన్ని కాపాడుకునేందుకు ప్రజానాట్యమండలి శక్తివంచన లేకుండా పోరాటాలు కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, సీపీఐ సహాయ కార్యదర్శి మోలా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పభుత్వ వైద్యశాలలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం

ఆత్మకూరు, మే 23, ప్రభాతవార్త : పట్టణంలోని ప్రభుత్వం సామాజిక వైద్యశాలలు ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా రక్తపోటు (బీపీ) మధుమేహంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ రాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి కారణంగా మధుమేహం రక్తపోటు సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఈ వ్యాధులను నియంత్రించవచ్చని సూచించారు. ఆత్మకూరు డివిజన్ పోలీస్ శాఖ పరిధిలోని కొత్తపల్లి, పాములపాడు పోలీస్ స్టేషన్లకు చెందిన కానిస్టేబుళ్లు వైద్య సిబ్బంది రక్తపోటు ఈసీజీ మధుమేహపరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూచనలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆస్మా మస్తాన్ వలీ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ చెంచులక్ష్మి వైద్య సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా.. 104 మందికి ఉద్యోగాలు

కర్నూలు అర్బన్, మే 23, ప్రభాతవార్త నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో కర్నూలులోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళా =శాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 13 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 310 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. వీరిలో 104 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి, జిల్లా ఉపాధి అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.టి. మాదన్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ

కర్నూల్ హాస్పిటల్, మే 23, ప్రభాతవార్త: కర్నూలు నగర 3 టౌన్ సీఐ పి శేషయ్య సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షయవ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ మరియు పండ్లు పంపిణీ చేశారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేయడం జరిగింది. రోగులు త్వరగా కోలుకోవడానికి సరైన పోషకాహారం ఎంతో అవసరమని వైద్య అధికారులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని ఆసుపత్రి సిబ్బంది, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులు అభినందించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలని అధికారులు కోరారు.

యువ కౌలు రైతు మృతి

కర్నూలు అర్బన్, మే 23, ప్రభాతవార్త : కల్లూరు మండలం దూపాడు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గని రాముడు (38) అనే యువ కౌలు రైతు శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎండలో పొలంలో పనిచేస్తున్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలినట్లు గ్రామస్తులు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే చికిత్స కోసం తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిసింది. గని రాముడు మృతి గ్రామంలో విషాద ఛాయలు నింపింది. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ఆయనే ఆధారంగా ఉండటంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటి పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకుందాం..



డోన్, మే 23, ప్రభాతవార్త : ఆపరేషన్ క్లీన్ షిప్ కార్యక్రమంలో భాగంగా శనివారము డోన్ మున్సిపల్ కమిషనర్ ఎస్ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో డోన్ పాత బస్టాండ్ నందు గాంధీ చౌక్ దగ్గర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తానే సూపర్ పట్టి రోడ్లలో ఊడిచే కార్యక్రమం చేపట్టారు మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రతకు సహకరించాలని ఆయన కోరారు అదేవిధంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజలుకు సూచించారు అదేవిధంగా ప్రధాన రహదారులపై చెత్తను ఊడ్చి ప్రజలకు అవగాహన కల్పించారు అదేవిధంగా పట్టణ ప్రజలు చెత్త చదరంతో పాటు ప్లాస్టిక్ కవర్లు కూడా ఎక్కడపడితే అక్కడ వేయకూడదని హెచ్చరించారు ప్లాస్టిక్ కవర్ల వల్ల డ్రైనేజీ సమస్యలు ఎక్కువ అవుతాయని వర్షాకాలంలో డ్రైనేజీలు ప్లాస్టిక్ కవర్ల వల్ల పూడికలు తీయడానికి ఇబ్బంది కలిగి అవకాశం ఉందని కావున ప్లాస్టిక్ కవర్లు కూడా నిషేధించినప్పటికీ ప్లాస్టిక్ కవర్లు యదేచ్ఛగా వ్యాపారస్తులు యూస్ చేస్తున్నానని వారి పైన నిఘా ఉంచామని ప్లాస్టిక్ కవర్లు వాడే వారి పైన జరిమానాలు విధిస్తామని వ్యాపారస్తులకు హెచ్చరించారు అదేవిధంగా పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. బిజెపి నాయకులు ఆర్మీ రామయ్య మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు మూడింతలు చేస్తామని మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

వెల్దుర్తి, మే 23, ప్రభాతవార్త : కెమికల్ ట్రిక్‌తో ప్రజలను మోసం చేస్తున్న నిందితుడిని క్రిష్ణగిరి పోలీసులు పట్టుకున్నారు.కర్నూలు జిల్లా, సి.బెలగల్ మండలం , ప్యాతోలి గ్రామానికి చెందిన గొల్ల వెంకటేష్ అనే వ్యక్తి లక్ష రూపాయలు తీసుకుని, వాటిని మూడింతలు చేసి మూడు లక్షలు ఇస్తానని చెప్పి ఓ వ్యక్తిని మోసం చేసి పరారీలో తిరుగుతున్నాడు.మోసపోయిన బాధితుడు క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మోసం చేసిన వెంకటేష్ అనే వ్యక్తిని 22.05.2026 తేదీన వెల్దుర్తి గ్రామం శివారులో పోలీసులు అరెస్టు చేశారు.నిందితుడు కొన్ని కెమికల్స్ ఉపయోగించి సాధారణ నోట్లను నల్లగా మార్చి, వాటిని ప్రత్యేక పద్ధతిలో కెమికల్‌తో కడిగితే అసలు నోట్లుగా మారుతాయని ప్రజలను నమ్మిస్తూ మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.నల్లటి కాగితాలను ఇచ్చి, కెమికల్ పేరుతో సాధారణ నీళ్లు అందించేవాడని పేర్కొన్నారు. బాధితుడు వాటిని కడిగినా నగదుగా మారకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి, వెంకటేష్ ఆచూకీ తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అరెస్టు సమయంలో నిందితుడి వద్ద నుండి కొన్ని నల్లటి కాగితాలు, నల్లగా మార్చిన సాధారణ నోట్లు,నగదు రూ.2 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని రిమాండ్ నిమిత్తం డోన్ మెజిస్ట్రేట్ గారి ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. ప్రజలు ఇలాంటి డబ్బులు రెట్టింపు చేస్తామనే మోసపూరిత ట్రిక్స్‌ను నమ్మి మోసపోవద్దని వెల్దుర్తి సర్కిల్ సీఐ యుగంధర్ హెచ్చరించారు. ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసిన పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య ను,వెల్దుర్తి సీఐ యుగంధర్ ను , క్రిష్ణగిరి ఎస్సై కృష్ణమూర్తిని పోలీసుసిబ్బందిని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జైలుకు తరలిస్తాం..!

– ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరిక – పెసరవాయి గ్రామంలో వజ్ర ప్రహార్ కార్యక్రమం..

గడివేముల, మే 23, ప్రభాతవార్త; చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, జైలుకు తరలిస్తామని గడివేముల ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆపరేషన్ వజ్ర ప్రహార్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఎం.జావళి సూచనలతో సమస్యాత్మక గ్రామమైన పెసరవాయిలో ఎస్ఐ సిబ్బందితో కలిసి ఆపరేషన్ వజ్ర ప్రహార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులు, నేరచరిత్ర గల వారి ఇళ్లు, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. అనంతరం అదే గ్రామంలో ఉన్న ఫ్యాక్షన్ పికెట్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు అనుమానిత బెల్ట్‌షాపులు, ఇళ్లను కూడా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై ఎస్ఐ మాట్లాడారు. మహిళలు, పిల్లలపై నేరాలు, ఆస్తి నేరాలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమ, నిబంధనలు, బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్ మోసాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ఫ్యాక్షన్ మరియు రాజకీయ సంబంధిత సమస్యలు, శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అక్రమ మద్యం సరఫరా, గంజాయి తదితర వాటిని నిర్వహించినా, పాల్పడినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేని అక్రమ విద్యుత్ కనెక్షన్లపై చర్యలు

– తహసీల్దార్ నారాయణరెడ్డి

హాలహర్వి, మే 23, ప్రభాతవార్త; మండలంలోని బాపురం, పచ్చారపల్లి, చింతకుంట తదితర గ్రామాల్లో అనుమతి లేని అక్రమ విద్యుత్ కనెక్షన్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఎల్ఎల్‌సీ కాలువ జలచౌర్యానికి విద్యుత్ శాఖ అధికారులు తమ అనుమతి లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలో ఆయా గ్రామాల్లో పర్యటించి అనుమతి లేకుండా ఎల్ఎల్‌సీ కాలువ జలచౌర్యానికి ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని తుంగభద్ర డ్యాం అధికారులకు విషయం తెలియజేయడం జరిగిందని ఆయన తెలిపారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లతో జలచౌర్యానికి పాల్పడుతున్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఆయా గ్రామాల వీఆర్వోలను ఆదేశించారు.

గ్రామాల్లో దాహం..దాహం..

హాలహర్వి, మే 23, ప్రభాతవార్త; మండలకేంద్రమైన హాలహర్వి, బాపురం, జె.హొసల్లి గ్రామాల్లో గత మూడు రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బాపురం పంప్‌హౌస్‌లో కార్మికుడు సురేష్ ఫిల్టర్‌బెడ్ రింగు ఆవిలో పడి మృతిచెందడంతో నీటి పంపింగ్ కార్మికులు విధులకు హాజరుకావడం లేదు. దీంతో కుళాయిలకు నీరు సరఫరా చేసే వారు లేక గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. కుళాయిలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఫిల్టర్‌బెడ్ రింగు బావుల్లో ఉన్న కలుషిత నీటిని తొలగించి రింగు బావులను శుభ్రం చేసి కుళాయిలకు నీరు సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

– ఎంపీడీఓ వరలక్ష్మీ

హాలహర్వి, మే 23, ప్రభాతవార్త; సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ వరలక్ష్మీ హెచ్చరించారు. శనివారం మండలకేంద్రమైన హాలహర్వి సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది పనితీరుపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ రకాల సర్వేలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక సమాజానికి అవసరం

– గ్రంథాలయ అధికారిణి మద్దమ్మ

పగిడ్యాల, మే 23, ప్రభాతవార్త : గ్రంథాలయాలు ఆధునిక సమాజానికి అవసరమనీ గ్రంథాలయ అధికారిణి మద్దమ్మ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ అధికారిణి అధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజానికి చాలా అవసరమనీ, ఎందుకంటే గ్రంథాలయానికి విద్యార్థులు రావడంవలన విద్యా ర్థులకు తెలియని విషయాలు నేర్చుకోవచ్చన్నారు. సమాజానికి అవసరమైన విజ్ఞానాన్ని విద్యార్థులు సముపార్జించవచ్చన్నారు. విద్యార్థులకు "బొమ్మరిల్లు కథలు " కథలలోని 'జాలిగుణం' అనే కథను విద్యార్థుల చేత చదివించి దాని భావమును గ్రంథాలయ అధికారిణి వివరించారు. విద్యార్థులకు చాక్‌లెటు , స్వీట్స్ గ్రంథాలయ అధికారిణి మద్దమ్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్‌మేరి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు జి.చంద్రన్న మృతి

– నివాళులు అర్పించిన నేతలు, ప్రజలు

హొళగుంద, మే 23, ప్రభాతవార్త; టీడీపీ పార్టీకి ఎన్నో సంవత్సరాలు అంకితభావంతో సేవలందించిన సీనియర్ నాయకులు, ఇంగళదహాల్ సర్పంచ్, ఎండీహళ్లి, పెద్దగోనేహాల్ గ్రామాలకు ఎంపీటీసీగా, టీడీపీ మండల కన్వీనర్‌గా ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్న జి.చంద్రన్న శనివారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఆలూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. జి.చంద్రన్న పార్టీకి చేసిన సేవలు, ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. మంచి నాయకుడిని కోల్పోయామని వాపోయారు. మృతి పట్ల పలువురు నేతలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు సంతాపం తెలియజేశారు.

బాలల హక్కులను పరిరక్షించుకుందాం..!

హొళగుంద, మే 23, ప్రభాతవార్త; మండలంలో శనివారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల హక్కులను పరిరక్షిద్దాం.. అనే అంశంపై యువజన సంఘాలకు 1వ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, వలంటీర్లు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో పాల్గొన్న వారందరికీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎంవీ ఫౌండేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ భాస్కర్ ప్రతినిధులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు ప్రతి పిల్లవాడు బడిలో ఉండాలనే లక్ష్యంతో సంస్థ పని చేస్తోందన్నారు. బాల కరిమ్మిక వ్యవస్థ ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతుండడం ఆందోళనకరమని తెలిపారు. పని చేస్తున్న పిల్లలను గుర్తించి వెంటనే పాఠశాలలో చేర్పించాలని సూచించారు. శిక్షణలో భాగంగా పిల్లల సమస్యలు, వారి సామాజిక పరిస్థితులు, సమస్యల పరిష్కార మార్గాలపై చర్చించారు. ప్రతి గ్రామంలో యువజన సంఘాలను ఏర్పాటు చేసి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలను పనిలో కాకుండా బడిలో చూడాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని పిలుపునిచ్చారు. బాలల హక్కుల ఉల్లంఘనలు గమనించిన వెంటనే 1098కు సమాచారం అందించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ సేవానాయక్, విలేజ్ ఆర్గనైజర్లు విజయ్, భారతి, మల్లేశ్వరి, శేఖన్న, మౌలాసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం సాగుపై రైతులకు అవగాహన

కొత్తపల్లి, మే 23, ప్రభాతవార్త; ఉద్యానశాఖ పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయిల్‌ఫాం పంటల సాగుపై ఉద్యానవన అధికారి కె చందన, పతంజలి మేనేజర్ రమణారెడ్డి రైతులకు అవగాహన కలి ్పంచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుచేసే రైతుకు ఎకరాకు 50 మొక్కల చొప్పున ఖచ్చితంగా అందిస్తామన్నారు. హెక్టారుకు రూ.10500ల చొప్పున ఆయిల్ ఫాం పంట ఖర్చులకు, అంతర్ పంట సాగుకొరకు ప్రోత్సహం అందిస్తామన్నారు. ఆయిల్‌ఫాం మొక్కలు సాగుచేసుకుంటే నాల్గవ సంవత్సరం నుంచి 25 సంవత్సరాల పాటు దిగుబడి ఇస్తుందని వారు తెలిపారు. ఈపంట సాగుచేసుకునేందుకు ప్రధానంగా నీటి వసతి కలిగి ఉండాలన్నారు. అసక్తిగల రైతులు తమ గ్రామానికి రైతు సేవాకేంద్రాల్లో సంప్రదిస్తే పతంజలి కంపెని సిబ్బంది మరియు ఉద్యానశాఖ ద్వారా రైతులకు మొక్కలు అందిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రైతుసేవా సిబ్బంది డి ఉషా, రైతులు పాల్గొన్నారు.

కులగణన సర్వేను ఖచ్చితత్వములో నిర్వహించాలి

నంద్యాల, మే 23, ప్రభాతవార్తప్రతినిధి : గ్రామీణ పట్టణప్రాంత స్థానిక సంస్థల్లో కులగనన సర్వేను ఖచ్చితత్వంలో నిర్వహించాలని డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ డెడికెటెడ్ కమీసన్ చైర్మన్ రంజన్ మిశ్రా అదికారులను అదేశించారు. శనివారము కలెక్టరేట్లఓని పిజిఆర్‌యస్ హాల్లో స్థానిక సంస్థల రిజర్వేషన్‌లపై అద్యయనము నిర్వహిస్తున్న నేపద్యములో బిసి సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలను డెడికెటెడ్ కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాల (రిటైర్డ్) స్వీకరించారు. ఈ కార్యక్రమంలేఓ జిల్లా కలెక్టరు రాజకుమారి డెడికెటెడ్ కమీషన్ కార్యదర్శి డిసి.రాజు జిల్లా వెనుకబడిన ఒక్షేమ శాఖ ఇన్‌చార్జి అదికారిరచింతామణజిల్లా అదికారులు వివిదకులసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భముగా డెడికెటెడ్ కమీషనన చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ రాష్ట్రంలో కులగనన జరుగుతున్న నేపద్యములో జిల్లాలోని బిసి జనాబాకు సంబందించిన ఖచ్చితమైన వివరాలను సేకరించాలని అదికారులకు సూచించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వమించి విశ్వసనీయమైన డేటాను సిద్దం చేయాలన్నారు. కులగనన అదారములనే భవిషత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు అవకాశము ఉంటుందనిచెప్పారు. అదేవిదముగా 2021 స్థానక సంస్థల ఎన్నికల సమయంలో గ్రామ పంచాయతీలు సహా వివిద స్థాయిల్లో జరిగిన ఎన్నికల్లో వెరనుకబడిన వర్గాలకు ఎన్ని స్థానాలు రిజర్వు చేయబడ్డాయి. వాటిలోఎన్ని భర్తీ అయ్యాయి. అలాగే అన్‌రిజర్వు కేటగిరల్లో బిసితు ఎంత మంది ఎన్నికయ్యారు. అనే వివరాలను సమగ్రంగా సేకరించాలని సూచించారు. కులగణన పసంబందించిన ఏటా మైగ్రేసన్ విజయవంతంగా పూర్తయిందని అదికారులు తెలియజేయగా సర్వే ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వం మరియు విశ్వసనీయతతో నిర్వహించాలని కమీషన్ చైర్మన్ అదేశించారు. సర్వేప్రక్రియను పూరత్తయిన అనంతరము వచ్చే వారంలో రోజుల్లో సూపర్ చెక్ నిర్వహించి తనికీ నివేదికలను సిద్దం చేసి జిల్లా కలెక్టరుకు సమర్పించాలని అదికారులకు సూచించారు. వివిద ప్రభుత్వసంక్షేమ పథకాలల్లోబిసి కులాల కవరేజ్ ఎలా ఉద్దన్న అంశంపై సమగ్ర నివేదిక సిద్దం చేయాలని అదేశించారు. అలాగే విద్యా శాఖ అదికారులతో సమావేశం నిర్వహించి వివిద కులాలకు చెందిన విద్యార్థుల నమోదు వివరాలను సేకరించిగిలని సూచించారు. సర్వేకు సంబందించిన వివరాలను త్వరలో గ్రామ సభల్లో ద్రర్శించి ప్రజల దృవీకరకు ఉంచనున్నట్లు తెలిపారు. పేర్లు విద్యార్థుతలు లేదా ఇతర వివరాల్లో పొరపాట్లు ఉంటే వాటిని సమరించుకునే అవకాశముఎ కల్పించి అభ్యంతారలను స్వీకరించాలని సూచించారు. కరోర్టు మార్గదర్శకాల ప్రకారము ఈప్రక్రియ తప్పనిసరిగా చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయాగాలో ఎస్‌జిఎన్‌డి శాఖ ద్వారా అవసరమైన సమాచారాన్నిఇ సేకరించి జిల్లాలకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలోని బిసి కుల సంఘాల నాయకులు నుంచి వినతులు స్వీకరించేందుకు డెడిటెడ్ కమీషన్ చైర్మన్ జిల్లాకు రావడము జరిగిందన్నారు. ఈ అవకాశాన్నిఇ ప్రతిఒక్కరూ సద్వినియోగము చేసుకోవాలని కోరారు.

డెడికెటెడ్ కమీషన్‌కు అందిన వినతులు : రాష్ట్రంలో అత్యంత వెరనుకబడిన వర్గాల జాబితాలో వాల్మికులు మొదటిఓ స్థానంలో ఉన్నారని వారిని ఎస్టి లేదా ఎస్సి జాబితాల్లో చేర్చాలని జాతీయ వాల్మికి ఊఐక్య పోరాట సమితి నాయకులుకమీషన్చైర్మన్‌కు వినతి పత్రము ఇచ్చారు. బిసి రిజర్వేషన్ శాతము పెంచడము ద్వారా రాజకీయంగా కూడా అబివృద్ది చెందే అవకాశము కల్పించాలని కోరారు. జిల్లాలో వడ్డె జాతి సుమారు రెండరు లక్షల జనాబా ఉన్నప్పటికి రాజకీయంగా వెనుకబాటుతనంలో ఉన్నామని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాబా ప్రాతిపదకన ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ వినతిపత్రము ఇచ్చారు. అదునిక పరిశ్రమలు యంత్రాలు వినియోగము పెరగడముతో విశ్వబ్రాహ్మణులకు చెందిన సంప్రదాయ చేతి వృత్తులు క్షీణిస్తున్నాయని కుటుంబ పోషణతో పాటు చేతి వృత్తుల సంరక్షణ కోసం ఉపాది కార్యక్రమాలు ప్రభుత్వం కల్పించాలని విశ్వబ్రాహణులు వినతి పత్రము ఇచ్చారు.

వెనకబడిన (ఓబిసి) కులాలను మోసం చేసేందుకు రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్

– బహుజన ముక్తి పార్టీ

కర్నూలు విద్య, మే 23, ప్రభాతవార్త; రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబిసి కులాల రిజర్వేషన్ గురించి అయా కుల సంఘాల అభిప్రాయాలను తెలుసు కునేందుకు వారి అభివృద్ధికి ఏమి కోరు కుంటున్నారో తెలుసు కునేందుకే రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ కర్నూలుకు రావడం జరిగింది. ఈసందర్భంగా బహుజన ముకి పార్టీ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ దాసరి రామశేషయ్య, ఎన్‌కె జయన్నలు కమిషన్‌ను కలిసి తమ అభిప్రాయాలను వివరిస్తు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఓబిసి స్థితిగతులను తెలుసుకోవాలన్న, రిజర్వేషన్ కల్పించాలన్న ప్రస్తుతం భారత ప్రభుత్వం చేపట్టిన జాతీయ జనగణనలో ఓబిసిల కులగణన జరగాలని ప్రభుత్వం ఓబిసి కులాలను మోసగించేందుకే వారి కులగణనకు అవకాశం లేకుండా ప్రొఫార్మ రూపొందించారు. ఓబీసీ కులగణనతోనే వారి అభివృద్ధి ముడిపడింది. ఇప్పటికే దేశ జనాభాలో 60 శాతం జనాభా ఉన్నట్లు అనధికార లెక్కలున్నప్పటికి వారికి రావాల్సిన, వారి అభివృద్ధికి కావాల్సిన నిధులు, రిజర్వేషన్ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వానికి ఓబిసిల పట్ల వారి సమస్యల పట్ల రిజర్వేషన్ పట్ల చిత్తశుద్ది ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో 52శాతం రిజర్వేషన్ మరియు జాతీయ జనగణనలో ఓబిసి కులగణన చేపట్టాలని బహుజన విముక్తి పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు శేషఫణి, బుడగజంగాల నాయకుడు రామాంజనేయులు, దాసరి రామశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

– అన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి – ఎస్ఐ తిరుపాలు

పాములపాడు, మే 23, ప్రభాతవార్త; మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకొని అన్‌లైన్ మోసాలపై పట్ల అప్రమత్తంగా ఉంటే నేరాల సంఖ్య తగ్గుతుందని పాములపాడు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. శనివారం వేంపెంట గ్రామంలో మహిళలకు శక్తిటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న వివిధ రకాల నేరాలపై అవగాహన కల్పించారు. బాలికలకు చిన్నవయసులో పెండ్లి చేసినట్లయితే అనారోగ్యపరిస్థితులు వస్తాయని బాల్య వివాహాలు చేయరాదన్నారు. మహిళల పట్ల జరుగుతున్న లైంగిక వేధింపులపై వారు ఎదురొ ్కంటున్న సమస్యలను, జాగ్రత్తలను వివరించారు. ఈవ్‌టీజింగ్ వల్ల పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. బాలురకు, బాలికల పట్ల గౌరవంగా మెలగాలని తల్లిదండ్రులు నేర్పించాలన్నారు. బాలికలు సైతం సెల్‌ఫోన్లకు అడాప్ట్‌కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికల పట్ల స్నేహపూర్వకంగా మెలగాల్సిన పద్ధతులు తల్లిదండ్రులు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికల అత్యవసర పరిస్థితుల్లో శక్తియాప్‌ను వినియోగించుకోవాలని 181, హెల్ప్‌లైన్ 100కు డయల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపిక

ఆదోనిలీగల్, మే 23, ప్రభాతవార్త; రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కర్నూలు జిల్లా తరపున ఆదోనికి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కృష్ణా జిల్లా అవనిగడ్డలో స్వర్గీయ శ్రీ మండలి వెంకటకృష్ణారావు 100వ శత జయంతి సందర్భంగా ఉమ్మడి రాష్ట్రసా ్థఇ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రసా ్థయి కబడ్డీ పోటీలకు ఆదోని విజయనగర్ కాలనీకి చెందిన బోయ నరసింహులు, వాల్మీకి నగర్‌కు చెందిన బోయ అశోక్, అరుణ్‌జ్యోతి నగర్‌కు చెందిన ఫిలిప్స్, కబడ్డీ క్రీడాకారుడు హెచ్.అనిల్ ఎంపికైనట్లు కర్నూలు జిల్లా సెక్రటరీ ఆర్.సుధాకర్, జాయింట్ సెక్రటరీ ఎస్.అమర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని, ప్రతిఒక్కరూ గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను అభినందించారు.

పారాక్వాట్ గడ్డి మందు పూర్తిగా నిషేధం

మహానంది, మే 23, ప్రభాతవార్త; పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందును ప్రభుత్వం పూర్తిగా నిషేధించినట్లు మహానంది మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం గాజులపల్లె గ్రామంలో పురుగుమందుల దుకాణాలను ఏవో తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణానికి హానికలిగించే ప్రమాదకరమైన పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందును పూర్తిగా నిషేధించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. వైద్యులు వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన నిపుణుల కమిటీ రూపొందించిన పూర్తి నివేదికల అధారంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అరటి పంటలో కలుపు నివారణకు రైతులు ఈ గడ్డి మందును వినియోగిస్తున్నారని తక్కువ ధరకు లభించడం సత్వరంగా పలితాలు ఇవ్వడం ద్వారా దీనికి డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. విషపూరితమైన ఈగడ్డిమందును ఉపయోగించడం ద్వారా వివిధ వ్యాధుల బారీన పడు ప్రమాదం ఉందని కిడ్నీలు, కాలేయం దెబ్బతినడం, పార్కిన్సన్ వ్యాధి వచ్చే అవకాశముందని తెలిపారు. మే 22 నుంచి 60 రోజుల పాటు ఈగడ్డి మందు అమ్మకాలు, వినియోగం, నిల్వపై నిషేధం విధించినట్లు తెలిపారు. 353 లీటర్ల పారాక్వాడ్ మందుల నిల్వలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వాటిని నిలుపుదల చేసినట్లు తెలిపారు.

మహానందిలో జడ్జి దంపతుల పూజలు

మహానంది, మే 23, ప్రభాతవార్త; మహానందీశ్వరస్వామి వారి సన్నిధిలో రెండవ అదనపు జడ్జి శ్రీనివాసరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారి దర్శనార్థమై వచ్చిన వారికి ఆలయ ముఖమండపం వద్ద టెంపుల్ సూపరింటెండెంట్ నీలకంఠేశ్వర్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కళ్యాణమండపంలో వేదపండితులు నాగేశ్వరశర్మ వేదమంత్రోచ్చరణల మధ్య కండువాతో సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వారి వెంట కోర్టు కానిస్టేబుల్ సునీల్‌కుమార్, నారాయణస్వామి తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

– పంచాయితీ కార్యదర్శి వడ్డె రామకృష్ణ

రుద్రవరం, మే 23, ప్రభాతవార్త; మండల కేంద్రం రుద్రవరంలోని ప్రతివీధి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయితీ కార్యదర్శి వడ్డె రామకృష్ణ అన్నారు. ఈసందర్భంగా శనివారం పారిశుద్ధ్య సిబ్బందితో పారిశుద్ధ్యంపై అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులకు సహకరించి గ్రామంలోని ప్రజలు రోగాల భారీన పడకుండా ఆరోగ్యంగా ఉండేలా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన అదేశించారు. ఈయన వెంట పంచాయితీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన చేయాలి

– ఆర్డీవో విశ్వనాథ్



ఆళ్లగడ్డ, మే 23, ప్రభాతవార్త; ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపకల్పన కోసం రెవిన్యూ యంత్రాంగం ముమ్మరం చేయాలని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆర్డీవో విశ్వనాథ్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి పరిశీలనను గడువులోపు పూర్తిచేసి సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు. బూత్ లెవెల్ అధికారులు జూన్ 15 నుండి జూలై 14 వరకు ఇంటింటి సర్వేనిర్వహించనున్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్, మరణించిన వారి ఓటర్లను తొలగించేందుకు రాజకీయ పార్టీ నాయకులు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. వివిధ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు బూత్ లెవెల్ అధికారుల సమన్వయంతో సర్వేను పారదర్శకంగా నిర్వహించి ఆ వివరాలను ఎంఆర్‌ఓ అఫీసులో సమర్పించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదుచేయడంలో పార్టీలు సహకరించాలన్నారు. ఈసమావేశంలో ఆళ్లగడ్డ తహశీల్దార్ జ్యోతిరత్నకుమారి, ఇతర మండల తహవీల్దార్‌లు, టీడీపీ, బిజెపి, జనసేన, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులు.. ఆఫీసుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు..

– పట్టించుకోని అధికారులు

మద్దికెర, మే 23, ప్రభాతవార్త; మద్దికెర మండలంలో ఇప్పటివరకు జరిగిన రీ-సర్వేలో తప్పులు దొర్లాయని, తాము ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా పదేపదే తిరుగుతున్నామని రైతులు రంగన్న, వీరాంజనేయులు వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గొలుసు ద్వారా చేపట్టిన కొలతలకు ఎకరాకు ఐదు సెంట్లు తగ్గించినప్పటికీ మా పాసు బుక్‌లో ఉన్న భూమి మరింతగా తక్కువగా చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సర్వేలో అనేకమంది రైతులకు తప్పులు దొర్లడంతో హైదరాబాద్, బళ్లారి, అనంతపురంలో నివాసం ఉన్న రైతులు పలుమార్లు ఆఫీసుల చుట్టూ తిరిగినా పని కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వార్తా విలేకరి చంద్ర అధికారులను ప్రశ్నించగా.. శాటిలైట్ సర్వేలో భూమి తక్కువగా చూపించిన రైతుకు సమాచారం తెలియజేసి సరి చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

సెన్ససన్ 100శతాన్ని అదికమించాలి



కోవెలకుంట్ల, మే 23, ప్రభాతవార్త : ప్రభుత్వం, జిల్లా కలెక్టరు అదేశాల మేరకు సెన్సస్ 100 శాతిన్ని అదికమించాలని తహశీలుదారు పవన్‌కుమారరెడ్డి యంపిడిఓ వరప్రసాదులు చెప్పారు,శనివారము సాంత్రము 3.45 నిమిషాలకు సూపవరువైజర్లు, ఇలిమిలేటర్లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సెన్సస్ 100శాతాన్ని అదికమించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అదికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో బోరు రిపేరుకు కదిలొచ్చిన అధికారులు

కోడుమూరు,మే 23, ప్రభాతవార్త ; స్థానిక ఎస్సీ కాలనీల్లో బోరు రిపేరుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మరమ్మత్తు పనులు చేసేందుకు కదిలొచ్చారు. కాలనీల్లో ఏర్పాటు చేసిన బోరు పనిచేయక పోవడంతో కాలనీ వాసులు తాగు నీటి కోసం పలు ఇక్కట్లకు గురయ్యారు. ఈ విషయంపై స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ప్రజల ఇబ్బందులపై జిల్లా మాల మహనాడు అధ్యక్షుడు మునిస్వామి ఈ విషయాన్ని జిల్లా కెడిసిసి బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి,కోడుమూరు శాసన సభ్యులు బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకుపోయ్యారు. ఈ మేరకు నేతలు స్పందించి కాలని ప్రజల నీటి ఇబ్బందులను తొలగించేందుకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో హుటు హుటిన అధికారులు శనివారం ఉదయం నుంచి మరమ్మత్తు పనులు చేపట్టారు. నేతల స్పందనతో తమకు నీటి ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించిన నేతలకు మునిస్వామితో పాటు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

04 page 24_04 page 24.qxd 24-05-2026 AM 01:32 Page 1

రాజకీయాలకు అతీతంగా అటోనగరు సంక్షేమానికి కృషి

: ఆటోనగరు అబివృద్ధికిరూ 10కోట్ల వ్యయంతో ప్రతిపాదనులు
: ఆటోనరుగలోసెంట్రల్ లైటింగ్ మౌలిక వసతుల కల్పనకు హామీ

నంద్యాల, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:
నంద్యాల ఆటోనరుగ అబివృద్ధికి మరియు రాత్రిబగళ్లు కష్టపడే ఆటోనగరు కార్మికుల సంక్షేమానికి తామొ రాజకీయలలకు అతీతంగా కట్టుబడి ఉన్నామని రాష్ట్ర న్యాయ ముస్లీంమైనార్టి సంక్షేమ శాఖ మంత్రి యన్‌యండి ఫరూక్ స్పష్టము చేశారు. శనివారము నంద్యాలలో నిర్వహించిన ఒక కార్యక్రమాంలో అయన పాల్గొన్నారు. అటోనగరు కార్మకులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజములో అటోనరగు కార్మకుల పాత్ర ఎంతో కీలకమైనదని వరి శ్రమను గుర్తించి ప్రతి ఒక్కరరు గౌరవించాలని పిలుపు నిచ్చారు.అటో నగరు ప్రాంతములో మౌళిక వసతుల కల్పన రోడ్డ నిర్మణం తదితర అ బి వృ ద్ధి పనుల ప్రణాళికలు సిద్దం చేవామని ఈ విషయపై ఇప్పటికే ముఖ్యమంత్రి మరియు సంబందిత మంత్రులను కలిసి నిదుల కొరకు చర్చించామని చెప్పారు. గతంలో అటోనగరు కార్మికులకు కేటాయించిన స్థలాల విషయములో పెరిగిన ప్రస్తుత మార్కెట్ ధరలను పరిగనలోనికి తీసుకుని కార్మికులకు ఎలాంటి నష్టం వాటిళ్లకుండా అందరికీ న్యాయం జరిగేలా చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. అటోనగరుకు అనుకూలంగా ఉండేలా సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడముతో పాటు తాగునీరు ఇతర కనీస సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. తాము ఎప్పుడూ అటోనగరు కార్మికుల సంక్షేమం విసయములో రాజకీయం చేయలేదని కేవలము కార్మికులకు మేలు చేయడమే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. నేను ఇపుడు మాట్లాడే వ్యక్తులకు ఎవరు అపుడు రాజకీయాల్లో లేరని ఇది వారు గమనించాలన్నారు. అటోనగరు అబివృద్ధి చేసింది తెలుగు దేశం పార్టి అని నేను మంత్రిగా ఉన్నపుడు అన్ని విదాలుగా అటోనగరుని అబివృద్ధి చేస్తున్నామని అటోనగరుపై ఇతరుల జోక్యం చేసుకుంటే సహించే వ్రక్తి లేదని హెచ్చరించారు.పరోక్షంగా మాజీ యంయల్ఎ భూమాను సున్నితంగా హెచ్చరించారు. అటో నగరు అబివృద్ధికి రూ 10కోట్లకు పైగా నిదులు తేవడానికి అయాశాఖలమంత్రులతో చర్చించామని చెప్పారు.గత ప్రభుత్వాల కంటే మిన్నగా కార్మికుల ప్రయోజనాలను కాపాడతానని భరోసా ఇచ్చారు.

ఇందన పొదుపుకు జిల్లా అధికారులు సమిష్టిగా బస్సులో ప్రయాణము

నంద్యాల, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:
ఇందన పొదుపు చర్యల్లో బాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన్ మంత్ ఫోర్ విజిట్ కార్యక్రమానికి అదర్శవంతముగా అమలు చేస్తున్న జిల్లా కలెక్టరు రాజకుమారి జేసి సూరజ్ ధనుంజయ్ మరియు ఇతర అదికారులతో సహా శనవారము నంద్యాల జిల్లా కేంద్రము నుండి అళ్లగడ్డకు బస్సులో ప్రయానించారు. శనివారము అళ్లగడ్డ నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టరు తమ వాహనాలను పక్కన పెట్టి జేసి దనుంజయ్‌తో కలిసి బస్సులో ప్రయానించారు. ఈసంద ర్భముగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్రం ముఖ్యమంత్రి సూచనలుమేరకు ప్రతి ఒక్కరిలో ఇందన పొదుపుపై అవగాహణ కల్పించడము అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు సందేషం ఇచ్చే ముందు అదికారులే అచరణలో చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ చర్యలుచేపట్టినట్లు జిల్లా డివిజనల్ నియోజక వర్గం మరియు మండల స్థాయి అదికారులు తమ తమ వ్యక్తిగత వాహనాల్లో కాకుండా సమిష్టిగా మూడు బస్సుల్లో ప్రయాణించేలా ప్రత్యేక ప్రణాలిక రూపొందించినట్లు వెల్లడించారు.ఇకపై వన్ మంత్ ఫోర్ విజిట్ కార్యక్రమమం కింద ఏ నియోజక వర్గానికి వెల్లిన ఇదే విదానమును కొనసాగిస్మాతని స్పష్టం చేశారు. సంయుక్తం తనికీలు సమావేషాలు లేదా పర్యటన సందర్బాల్లో పలువురు అదికారులు విడి విడివిగా వాహనాలు వినియోగించకుండా ఒకే వాహనములో ప్రయానించడము ద్వారా ఇందన వినియోగాన్ని గణనీయంగా తగ్గంచ వచ్చన్నారు.ఈ చర్యల ద్వారా ప్రజల్లో కూడా ఇందన పొదుపుపై మరింత అవగామణ పెరుగుతుందని అశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకే ఇందనాన్ని వినియోగిస్తూ వృధా ఖర్చులను తగ్గించుకునే దిశగా ముందుకు రావాలని కలెక్టరు ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

జొన్నరైతులకు అండగా వైసిపి యువజన విభాగం

: జొన్న రైతులకు మూడవ రోజుల బోజనాలు అందించిన వైసిపి

నంద్యాల,మే 23,ప్రభాతవార్తప్రతినిధి :
నంద్యాల జిల్లా కేంద్రముఏలో గత మూడు రోజులుగా స్థానిక గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్న జొన్న వైసిపి నంద్యాల జిల్లా అద్యక్షులు కాటపాని రాంభూపాల్‌రెడ్డి అదేశాల మేరకు వైసిపి యువజన విబాగము అద్వర్యంలో శనివారము జిల్లా యుజనజిల్లా విభాగా అద్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి బో.జన ఏర్పాట్లు చేశారు. రైతులు లిండి తిప్పలు మానేసి గోదామొల వద్దను బండ్లు నిలుపుకెని ఇబ్బందులు గమనించిన కాటపాని రాంభూపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ ఇసాకు బాస వారిని తక్షణమే ఏఅదుకోవాలనిడిమాండు చేశారు.చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని అదికారులు కోరడమైందని దీనితపై స్పందించిన జిల్లా వొఐకాపా యువ.జన విబాగబము నేతృత్వం లో రైతులకు మూడు రోజులుగా అన్నదానము కార్య క్రమాన్ని జిల్లా అద్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంబించడము జరిగింది. ఈ సందర్భముగా రాష్ట్ర ప్రదాప కార్యదర్శి శ్రీకాంతరెడ్డి సద్దల చంద్ర శేఖరరెడ్డి మాట్లాడుతూ అన్నదాతల కష్టాలను గుర్తించి అండగా నిలబడమే ఈ సేవా కార్యక్రమంలో పలువురు వైసిసి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగలో పాల్గొని.. ఉల్లాసంగా ఉండాలి

: ప్రజలకు ఉపయోగపడే పని చేశాము
మాజీ మంత్రి బుగ్గన
డోన్ మే 23 ప్రభాతవార్త :
డోన్ నియోజకవర్గం లో ప్రతి ఒక్కటి ప్రజాభిప్రాయం మేరకు పార్టీలకు అతీతంగా పనిచేసే చూపించమని రాష్ట్ర మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు శనివారం డోన్ పట్టణంలోని కె వి ఎస్ పార్కు నందు వాకింగ్ చేసి అనంతరం యోగ కేంద్రానికి వెళ్లి యోగ చేస్తున్న ప్రజలతో ముచ్చటించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో పట్టణంలో యోగ చేసుకోవడానికి స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని పార్టీలకు అతీతంగా వచ్చిన ప్రజలకు ఉపయోగపడే విధంగా యోగ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అని తెలిపారు యోగ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల చాలామంది యోగాలో పాల్గొని ఎంతో ఉత్సాహంతో మానసిక ఉత్సాహంతో

ఉల్లాసంతో ఉంటున్నారని తెలిపారు యోగ చేయడం వాకింగ్ చేయడం మనిషికి దృఢత్వం పెరగడమే కాకుండా ఉత్సాహం ఉంటుందని తెలిపారు ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ రాజశేఖర్ రెడ్డి 30 వార్డ్ గడ్డం సురేష్ సోమేష్ యాదవ్ న్యాయవాది నాగభూషణం రెడ్డి పాలుట్ల రఘురాం న్యాయవాది మధుసూదన్ రెడ్డి వడ్డే నారాయణస్వామి లక్ష్మిరెడ్డి దార ప్రతాప్ రెడ్డి టి ఆర్ నగర్ ఎరుకల సుధాకర్ పెయింటర్ వెంకటేష్ రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ఎన్నికలపై.. ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం

కర్నూలు అర్బన్ 23 ప్రభాతవార్త :
కర్నూలు నగరంలోని శ్రీలక్ష్మిమి ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ఎన్నికలకు సంబంధించిన ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదన్ రెడ్డి బూత్ లెవెల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఎస్ఐఆర్ అంటే ఏమిటి, బీఎల్ఏలు నిర్వహించాల్సిన ముఖ్య బాధ్యతలు ఏమిటి, ఎన్నికల సమయంలో నిర్లక్ష్యం వహిస్తే కలిగే నష్టాల గురించి ఆయన అవగాహన కల్పించారు. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా లక్షలాది ఓట్లు తొలగించబడిన ఉదాహరణలను ప్రస్తావిస్తూ, బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ అబ్జర్వర్ చల్లా విఘ్నేశ్వర రెడ్డి, పార్టీ కేంద్ర కార్యాలయ సభ్యులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

డెడికేషన్ కమీషనరును కలిసి వినతిపత్రం సమర్పించిన..
జిల్లా అధ్యక్షులు వై నాగశేషు

నంద్యాల సీటీమే 23 ప్రభాతవార్త :
స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో ఏబిసిడి వర్గీకరణ చేసి వెనుకబడిన తరగతులకు న్యాయం అందించవలెను రాష్ట్రంలో గత ప్రభుత్వాలు స్థానిక సంస్థల ఎన్నికలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు జరిగినవి గత వైసిపి ప్రభుత్వ హాయంలో హైకోర్టు ఎస్సీ ఎస్టీ బీసీలకు చెందిన మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించాయని సుప్రీంకోర్టు ఆర్డర్ నేపము చూసి గతంలో 34 శాతం రిజర్వేషన్లు కూడా బీసీలకు ఇవ్వకుండా అన్యాయం చేసి 24 తో ఎన్నికలు జరిగిన విషయము మీ దృష్టికి తెలియపరుస్తున్నాము అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీలకు జరుగుతున్న రిజర్వేషన్ల శాతం ప్రకారము బీసీలకు కూడా వారి జనాభా దామాషా ప్రకారం ప్రతి కేటగిరీలో కూడా రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలి జనాభా దామాషా ప్రకారము సర్పంచ్ జెడ్పిటిసి ఎంపీటీసీ వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే ఎంపీ రాజ్యసభ వరకు బీసీలకు సంపూర్ణ రిజర్వేషన్ ఏర్పాటు చేయాలని మనవి ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు వై నాగశేషులతోపాటు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీనారాయణ గౌడ్ బేతంచెర్ల మండల అధ్యక్షుడు బుంగ రాజశేఖర్ మం0డ్ల లక్ష్మణ్ మరియు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు

నంద్యాలలో అపరేషన్ క్లిన్ స్వీప్ కార్యక్రమానికి శ్రీకారము

నంద్యాల,మున్సుపాల్టి,మే 23,ప్రభాతవార్త :
రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక పారిశుద్యడ్రైవ్ ఆపరేషన్ క్లిన్ స్వీప్ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి యన్‌యండి ఫరూక్ శ్రీకారము చుట్టారు. శనివారము మున్సుపల్ కమీషనరు బండిశేసన్న అద్వర్యంలో నిర్వహించిన అపరేషన్ క్లిన్ స్వీప్ కార్యక్రమంలో ర్యాలీ చేపట్టారు.అ ర్యాలీని మంత్రి స్వయంగా ప్రారంబించారు.నంద్యాల పట్టణంలోని గాందీ చౌకు కూరగాయలమార్కెట్ పరిసరాలల్లో ఈపారిశుద్య కార్యక్రమానికి శ్రీకారము చుట్టారు. ఈసందర్భము మంత్రి మట్లాడుతూ రాష్ట్రంలో 123 పట్టన స్థారనిక సంస్థల్లో నేటి నుండి జూన్ 20వరకు నెల రోజుల పాటు ఈ అపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమము నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు.

జొన్నరైతులకు అండగా..

: చివరిగింజ వరకు కొనుగోలు చేయాలని
అధికారులకు కాటసాని రాంభూపాల్ రెడ్డి విజ్ఞప్తి
నంద్యాల సిటీ, మే 23 ప్రభాతవార్త:
నంద్యాల జిల్లాలోని సెంట్రల్ వేర్‌హౌస్ వద్ద గత మూడు రోజులుగా జొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు తమ పంటను విక్రయించేందుకు రైతులు పెద్ద సంఖ్యలో సెంట్రల్ గిడ్డంగులకు తరలివచ్చారు. అయితే గిడ్డంగుల్లో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో పలువురు రైతుల వాహనాలను లోపలికి అనుమతించక పోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు బయట

నిలిచిపోయాయి. రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి శుక్రవారం అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులకు అండగా నిలుస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది రైతులకు భోజన వసతి కల్పించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు సూర్యనారాయణ రెడ్డి, ద్వారం శ్రీకాంత్ రెడ్డి, సద్దల చంద్రశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యారాక్వాట్ గడ్డి మందు పై నిషేధం

మండల వ్యవసాయ శాఖ అధికారిని హేమలత

ఆత్మకూరు మే 23 ప్రభాతవార్త :
ప్యారాక్వాట్ గడ్డి మందును ప్రభుత్వం పూర్తిగా నిషేధించిదని మండల వ్యవసాయ శాఖ అధికారిని హేమలత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసి పారక్వాట్ గడ్డి మందులు నిల్వలను పరిశీలించడం జరిగింది. ప్యారాక్వాట్ డైక్లోరైడ్ 24 అత్యంత విషపూరితమైనటువంటి కలుపు మందు . ఇది మనుషుల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలగజేస్తుంది .ప్రస్తుతం దీనికి ఎటువంటి ప్రత్యేక ప్రతి విషం (యాంటిడోట్) అందుబాటులో లేదు. ఈ నిషేధం ప్రచురణ తేదీ నుండి అనగా 22/5/2026 నుండి 60 రోజులపాటు అమల్లోకి ఉంటుంది తదుపరి దర్యాప్తు అయ్యేవరకు ఈ నిషేధం అమల్లో ఉంటుంది. ఈ కలుపు మందును పత్తి, వరి, మొక్కజొన్న పంటలో కలుపు నివారణకు ఉపయోగిస్తారు .తక్కువ ధరకు లభించడం ,సత్వరంగా ఫలితాన్ని ఇవ్వడం వలన దీనికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎవరైనా దుకాణదారులు ఈ నిషేధించిన గడ్డి మందును అమ్మితే కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు.

బక్రీద్ పండుగ శాంతియుతంగా జరుపుకోవాలి

: పీస్ కమిటీ సమావేశం

ఆదోని క్రైమ్, మే 23 ప్రభాతవార్త:
రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బక్రీద్ పండుగను హిందూ, ముస్లిం సోదరులు పరస్పర ఐక్యతతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో నిర్ధారణ లేని సమాచారం, వివాదాస్పద పోస్టులు పెట్టడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై రామ్మోహ్ , ఆదోని పట్టణానికి చెందిన హిందూ, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు అందరూ

అప్పులు తీర్చలేక ఆత్మహత్య

రుద్రవరం, మే 23, ప్రభాతవార్తః
అప్పులు తీర్చలేక షేక్ మా బాష (35) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ జయప్ప తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మాచినేనిపల్లె గ్రామానికి చెందిన షేక్ మాబాష అనే వ్యక్తి మద్యానికి బానిపై తన అవసరాల కోసం, గృహంపై రుణం తీసుకొని సుమారు రూ.14 లక్షలు అప్పుచేసి ఆ అప్పు తీర్చలేక 18-05-2026న మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. పక్కనే ఉన్న స్థానికులు గమనించి అతన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించారు. అతని తల్లి షేక్ అబ్దుల్ బీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ జయప్ప తెలిపారు.

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభం

:రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈఆర్వో సమావేశం
బనగానపల్లె, మే 23 ప్రభాతవార్త:
భారత ఎన్నికల సంఘం దేశంలోని 16 రాష్ట్రాలు మరియు మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఈ కార్యక్రమంలో భాగమైంది. దీననుసరించి 140బనగానపల్లె అసెంబ్లీ నియోజక వర్గంలో 01072026 అర్హత తేదీగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సీహెచ్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి: సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ, ముద్రణ: 05062026 నుండి 14062026 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే: 15062026 నుండి 14072026 వరకు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ: 14072026 లోపు ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ: 21072026 అభ్యంతంరాలు, దరఖాస్తుల స్వీకరణ: 21072026 నుండి 20 082026 వరకు అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారం: 21072026 నుండి 18092026 వరకు తుది ఓటరు జాబితా ప్రచురణ: 22092026 ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల యంత్రాంగం

భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించ బడుతుందని ఆయన తెలిపారు. ఇంటింటి సర్వే సందర్భంగా బూత్ లెవల్ అధికారులు ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని చెప్పారు. రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు బి ఎల్ ఓలకు పూర్తి సహకారం అందించి ఓటరు జాబితాల కచ్చితత్వం, పారదర్శకతకు తోడ్పడాలని కోరారు. 140బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం పట్టణం లోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం, బనగాన పల్లెలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఓటర్ల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యం వహించారు. భారత ఎన్నికల సంఘం ప్రకటించిన 2026 షెడ్యూల్‌పై రాజకీయ పార్టీలతో చర్చించారు.

సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు:
హరి - టీడీపీ భాస్కర్ - జనసే నచెన్నయ్య - బీఎస్పీ యాదగిరి - బీజేపీ శివయ్య - సీపీఐ బాలు యాదవ్ - కాంగ్రెస్ అనిల్ - వైఎస్సార్సీపీ మదన్ గోపాల్ - బీజేపీ ఎ. సుబ్బారెడ్డి - జిల్లా సమితి సభ్యులు ఈ కార్యక్రమంలో అవుకు ఎమ్మార్వో మరియు బనగానపల్లె ఇన్‌చార్జ్ తహసీల్దార్ బి. నాగేశ్వర్ రెడ్డి, కోవెలకుంట్ల తహసీల్దార్ పవన్ కుమార్ రెడ్డి, సంజమల తహసీల్దార్ అనిల్ కుమార్, బనగానపల్లె ఆర్ఐ ప్రవీణ్ నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ గాలి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు జాతీయ రహదారిపై సూచిక బోర్డుల లేమి..ప్రమాదాలకు ఆహ్వానం..!

: ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిది?
ఆలూరు మే 23, ప్రభాతవార్తః
ఆలూరు జాతీయ రహదారిపై సూచిక బోర్డుల కొరత.. ప్రమాదాలపై స్థానికుల ఆందోళ నఆలూరు మండల కేంద్రం గుండా వెళ్లే జాతీయ రహదారిపై సరైన సూచిక బోర్డులు, హెచ్చరిక గుర్తులు, వీధి దీపాలు లేకపోవడంతో తరచూ ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో ప్రజలు అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో రహదారిపై తగినంత వెలుతురు లేకపోవడం, మలుపులు, డైవర్షన్లు, గ్రామ ప్రవేశ మార్గాల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చే ప్రయాణికులు దారి తెలియక అయోమయానికి గురవుతున్నారని, కొన్నిసార్లు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ఇలాంటి సమస్యలు చాలాకాలంగా ఉన్నప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు, జాతీయ రహదారి శాఖ అధికారులు పట్టించుకోకపోవడం చాలా విచారకరమని స్థానిక ప్రజలు మండిపడ్డారు. ఇప్పటికే పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. పట్టణ పరిధిలో సరైన సూచిక బోర్డులు, హెచ్చరిక ఫ్లెక్సీలు, రిఫ్లెక్టర్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, ముఖ్య కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో వాహనదారులకు సౌకర్యం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే రాబోయే రోజుల్లో భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రాణనష్టం జరిగితే దానికి పూర్తి బాధ్యత సంబంధిత శాఖ అధికారులదే అని స్థానికులు, వాహనదారులు

హెచ్చరిస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.